క్లుప్తంగా

నేడు రాధాష్టమి వేడుకలు

కొమ్మాది: బీచ్ రోడ్డు సాగర్‌నగర్‌లోని ఇస్కాన్ మందిరంలో ఆదివారం రాధాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని ఓ ప్రకటనలో తెలిపారు. వేకువజామున 4.30 గంటలకు మంగళహారతి, గురుపూజ, భజనలు, కీర్తనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

రాష్ట్ర కార్యవర్గంలో చోటు హర్షణీయం



మాట్లాడుతున్న సీపీఐ కార్యదర్శి రాంబాబు

తగరపువలస: ఈ నెల 20 నుంచి 25 వరకు ఒంగోలులో జరిగిన సీపీఐ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేసినందుకు భీమిలి ఏరియా నాయకులు శనివారం ధన్యవాదాలు తెలియజేశారు. గుజ్జు రామునాయుడు భవన్‌లో జరిగిన సమావేశంలో కాసూరి రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ నూతన కార్యవర్గంలో జిల్లాకు చెందిన చలసాని రాఘవేంద్ర రావు, కార్పొరేటర్ ఏజే స్టాలిన్, ఎ.విమల, షేక్ హుస్సేన్, మరుపిల్ల పైడిరాజులకు చోటు దక్కడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో మోర అప్పలరాజు, ఆదినారాయణ, సన్నిబాబు, వీర్రాజు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

గణేశుడి సన్నిధిలో అన్న సమారాధన



మధురవాడ రైతుబజార్ వద్ద అన్నప్రసాదం పంపిణీ చేస్తున్న ఈవో దాట్ల హరిత

మధురవాడ: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మధురవాడలోని వివిధ ప్రాంతాల్లో శనివారం అన్నసమారాధనలు నిర్వహించారు. మధురవాడ రైతు బజార్‌లో మండపం వద్ద శనివారం ఏర్పాటు చేసిన అన్న సమారాధనను ఈవో దాట్ల హరిత ప్రారంభించారు. కార్యక్రమలో కంచరపాలెం, చిట్టివలన ఈవోలు జగదీశ్వరావు, మురళీకృష్ణ యాదవ్, సూపర్‌వైజర్ అప్పలరాజు, రైతు కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమ పూజలు



కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

తగరపువలస: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి ఆనందపురం మండలం వేముల వలస రామాలయంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు శనివారంతో ముగిశాయి. ఐదు రోజుల పాటు రోజూ సాయంత్రం ఆధ్యాత్మిక ఉపన్యాసం, భజన కార్యక్రమాలు, రామాయణ, మహాభారత, శ్రీమద్భగవద్గీత ప్రవచన కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజు నిర్వహించిన సామూహిక కుంకుమ పూజల్లో మహిళలు పాల్గొన్నారు. ఎస్.కృష్ణ ఆధ్వర్యంలో స్థానిక భక్తులు చల్లా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నివాసాల్లోకి మురుగు నీరు



నివాసాల్లోకి వచ్చిన మురుగునీటిని పరిశీలిస్తున్న అధికారులు

మధురవాడ: అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, కాల్వల ద్వారా మురుగునీరు సక్రమంగా పారక నివాసాల్లోకి వచ్చేయడంతో పేదల బతుకులు దుర్భరంగా మారాయి. జీవీఎంసీ 5వ వార్డు మారికవలస ఆర్‌జీకే పాత కాలనీ 39–41 బ్లాకుల మధ్య డ్రైనేజీ పొంగి ప్రవహిస్తోంది. నెల రోజులుగా ఫిర్యాదు చేస్తున్నా, ఎవరూ పట్టించుకోలేదని స్థానికులు తెలిపారు. ఎట్టకేలకు శనివారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి, మలేరియా సూపర్‌వైజర్ దీవనమ్మ పరిశీలించి, బ్లీచింగ్ చల్లి మమ అనిపించారు. అధికారులు స్పందించి, మురుగు తొలగింపునకు శాశ్వత చర్యలు చేపట్టాలని నివాసితులు కోరుతున్నారు.

రహ‘దారుణాలు’

ఛిద్రమైన మూడు గ్రామాల రోడ్లు
అడుగడుగునా గోతులు
రాళ్లు తేలి రాకపోకలకు అవస్థలు



గ్రామ ప్రవేశంలో గోతులు పడిన విజయరాంపురం రోడ్డు

పద్మనాభం: మండలంలోని మూడు గ్రామాల రోడ్లు దారుణంగా ఉన్నాయి. గోతులు పడి రాళ్లు తేలిపోయాయి. ఛిద్రమైన ఈ రోడ్లపై రాకపోకలు సాగించడానికి ప్రజలు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఈ మూడు రోడ్లు చాలా ఏళ్లుగా శిథిలావస్థలో ఉన్నాయి. వర్షాలు కురవడంతో మరింత దారుణంగా తయారయ్యాయి. రోజు రోజుకూ గోతులు మరింత పెద్దవుతున్నాయి. దీంతో ఈ రోడ్లపై ప్రయాణమంటేనే పాదచారులు, వాహనచోదకులు హడలిపోతున్నారు. రాత్రి వేళల్లో మార్గం కనిపించక పాదచారులు రాళ్ల తన్నుకుని పడిపోతున్నారు. ఆటోలు నడపడం ప్రమాదకరంగా మారింది. ఆటోలతో పాటు ప్రయాణికులు ఊగిపోతున్నారు. పాలకులు, సంబంధిత శాఖ అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న తునిపాలెం రోడ్డు

కృష్ణాపురం..గోతులమయం

మండలంలోని కృష్ణాపురం రోడ్డు గోతులు పడింది. పద్మనాభం జంక్షన్ నుంచి కృష్ణాపురం గ్రామం వరకు రెండు కిలోమీటర్ల నిడివి గల రోడ్డు గోతుల మయంగా ఉంది. జగనన్న కాలనీ, పరదేశమ్మ ఆలయం, సచివాలయం వద్ద పెద్ద గోతులు తేలి ప్రమాదకరంగా ఉన్నాయి.



గోతులమయంగా కృష్ణాపురం రోడ్డు

ఆటో ఊగిపోతోంది



నేను తుని పాలెం నుంచి విజయనగరం, తగరపువలస ప్రాంతాలకు ఆటో నడుపుతాను. రోడ్డు మొత్తం పూర్తిగా శిథిలమైంది. గోతులు పడి రాళ్లు తేలిపోయింది. గోతులు పడి రాళ్లు తేలిపోవడం వల్ల ఆటో ప్రయాణిస్తున్నప్పుడు ఆటోతో పాటు ప్రయాణికులు అటు ఇటు ఊగిపోతున్నారు. ఆటో నడపడం ఇబ్బందిగా ఉంది.

– ఆర్.గౌరినాయుడు, తునిపాలెం ఆటో డ్రైవర్

తుని పాలెం.. అడుగు వేయలేం



రాళ్లు తేలిన తునిపాలెం రోడ్డు

మద్ది పంచాయతీ తునిపాలెం రోడ్డు దారుణంగా ఉంది. పాండ్రంగి–అలమండ ఆర్‌ఎస్ ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి రెండు కిలోమీటర్ల నిడివి గల ఈ రోడ్డు పూర్తిగా శిథిలమైంది. ఈ రోడ్డుపై అనంతవరం గ్రామస్తులు మద్ది, బాందేవపురం గ్రామస్తులు అనంతవరం వెళ్లడానికి ఉపయోగపడుతోంది.

విజయరాంపురం.. మట్టి రోడ్డే నయం..

బాందేవపురం పంచాయతీ విజయరాంపురం రోడ్డు అధ్వానంగా తయారైంది. పాండ్రంగి–అలమండ ఆర్ఎస్ నుంచి విజయరాంపురం వరకు మూడు కిలో మీటర్ల నిడివి గల రోడ్డు గోతులు పడింది. ఈ రోడ్డుపై భారీ వాహనాలు తిరగడంతో రోడ్డు గోతులు పడింది. కొన్ని చొట్ల రోడ్డు శిథిలమై మట్టి రోడ్డును తలపిస్తోంది.



మట్టి రోడ్డును తలపిస్తున్న విజయరాంపురం బీటీ రోడ్డు

మట్టి రోడ్డులా మారింది



మా ఊరి రోడ్డు శిథిలమై కొన్ని చోట్ల మట్టి రోడ్డులా ఉంది. తారు ఊడిపోవడంతో మట్టి రోడ్డుగా మారిపోయింది. మేము విజయగనరం జిల్లా అలమండ సంతకు నిత్యావసర వస్తువులు కొనుగోలు చేయడానికి ఆటోలో వెళతాం. వర్షాలు కురిస్తే రోడ్డు బురదమయంగా మారుతోంది. గోతులు పడడంతో ఆటోలో వెళ్లలేకపోతున్నాం.

– కె.అప్పలనాయుడు, విజయరాంపురం

వర్షాలకు కుదేలైన పూల వ్యాపారం



మార్కెట్లో పారేసిన తడిచి పాడైన పువ్వులు

తగరపువలస: ఇటీవల వరుస వర్షాలతో భీమిలి డివిజన్‌లో పువ్వుల రైతులు తీవ్రంగా నష్టపోయారు. శ్రావణమాసం, వినాయకచవితి పూర్తవడంతో సాధారణంగానే పువ్వులకు డిమాండ్ తగ్గింది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో బంతి రూ.100, చామంతి రూ.250, డజను గులాబీ రూ.20, మల్లె మూర రూ.50, కనకాంబరాలు మూర రూ.50, 15 మందారాలు రూ.10 వంతున విక్రయిస్తున్నారు. సన్మానాలు, సభలు జరిగితే దండలు, పుష్పగుచ్చాలు.. గృహ ప్రవేశాల సమయంలో పూలదండలు, పెళ్లిళ్లు ఇతర ఫంక్షన్ల సమయంలో పూలకు మంచి గిరాకీ ఉంటుంది. ప్రస్తుతం ఎలాంటి శుభకార్యాలు జరగకపోయినా చుట్టుపక్కల గ్రామాలలో వచ్చిన పూల దిగుబడిని మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఇలా తరలించిన క్రమంలో తోటల్లో, మార్కెట్‌లో పువ్వులు తడిచి ఫంగస్ చేరడం, వాడిపోవడం జరిగి చెడు వాసన వస్తుండటంతో మార్కెట్‌కు వచ్చే వినియోగదారులు పువ్వుల మార్కెట్‌వైపు చూడటం లేదు. దీంతో విక్రయాల కోసం వేచి చూసిన వ్యాపారులు, రైతులు చివరకు మార్కెట్‌లోనే వాటిని నేలపాలు చేసి ఇంటి ముఖం పడుతున్నారు.

పరిశ్రమలతో విద్యాసంస్థల అనుసంధానం అవసరం



పట్టభద్రుల వేడుకల్లో జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ జయ సుమ, హెచ్‌సీఎల్ హెచ్‌ఆర్ కంచన్ ఖేడ్కర్

తగరపువలస: పరిశ్రమలతో విద్యాసంస్థల అనుసంధానం అత్యవసరమని జేఎన్‌టీయూ–విజయనగరం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయ సుమ అన్నారు. ఆనందపురం మండలం శొంఠ్యాం నడింపల్లి సత్యనారాయణరాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్‌ఎస్‌ఆర్‌ఐటీ) పట్టభద్రుల వేడుక–2025 కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. విద్యార్థుల విజయానికి కమ్యూనికేషన్, కొలాబరేషన్, క్రియేటివిటీ, క్రిటికల్ థింకింగ్ ఎంతో కీలకమన్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్‌పై ప్రభుత్వ కార్యక్రమాలు, అమరావతి క్వాంటమ్ ల్యాబ్ ఎక్స్‌పో భవిష్యత్తు అవకాశాలను తెలియజేశారు. హెచ్‌సీఎల్ పీపుల్స్ స్ట్రాటజీ హెచ్‌ఆర్ హెడ్ కంచన్ ఖేడ్కర్, న్యూ ఢిల్లీలోని జామియా మిల్లియా ఇస్లామియా సీఎస్ఈ విభాగాధిపతి మహమ్మద్ అంజాద్ తదితరులు ప్రసంగించారు. కళాశాల అధ్యక్షుడు సత్యనారాయణరాజు అధ్యక్షతన పట్టభద్రులైన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. కళాశాల కార్యదర్శి ఎన్.ప్రసాదరాజు, కోశాధికారి ఎస్.కనకరాజు, ప్రిన్సిపాల్ ఎస్.శంభుప్రసాద్, సీఎంవో పి.ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రమట్టి దిబ్బల సమీపంలో ఇసుక అక్రమ రవాణా



తరలించేందుకు తీరం వద్ద ఉంచిన ఇసుక

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డులో సముద్రపు ఇసుక అక్రమ రవాణా మళ్లీ మొదలైంది. ఇటీవల మంగమారిపేట వద్ద సముద్రపు ఇసుకను అక్రమంగా తరలించడాన్ని రెవెన్యూ అధికారులు అరికట్టారు. ఇప్పుడు ఎర్రమట్టిదిబ్బల సమీపంలో రాత్రి సమయాల్లో సముద్రపు ఇసుకను తరలిస్తున్నారు. తీరం వెంబడి ఉన్న ఇసుకను కుప్పలుగా ఉంచి, రాత్రి సమయాల్లో లారీలపై తరలిస్తున్నారు. అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి వీటిని కట్టడి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన



సీపీఆర్ గురించి తెలియజేస్తున్న ట్రైనీ హసన్

తగరపువలస: ఆనందపురం మండలం వెల్లంకి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు హృదయ శ్వాసకోశ పునరుజ్జీవం(సీపీఆర్)పై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అపోలో ఆస్పత్రి సీపీఆర్ ట్రైనీ హసన్.. గుండెపోటు వచ్చిన వ్యక్తిని ఎలా కాపాడాలో విద్యార్థులకు ప్రయోగపూర్వకంగా వివరించారు. కార్యక్రమంలో క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ మస్తీ ఆల్తాడి, ప్రెసిడెంట్ ఆల్తాఫ్ బాబ్జిన్, ఉపాధ్యాయులు రోమర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అరకొరగా విద్యుత్ పనులు



విద్యుత్ లైన్ కోసం తవ్వి వదిలేసిన గొయ్యి

తగరపువలస: జీవీఎంసీ మధురవాడ జోన్ 6వ వార్డు లుంబినీ పార్కు అశోక్‌నగర్ ఎస్సీ, ఎస్టీ కాలనీలో ఎలక్ట్రిక్ కాంట్రాక్టర్ విద్యుత్ పనులను అరకొరగా చేపట్టి వదిలేశాడు. విద్యుత్ లైన్ కోసం తవ్విన రోడ్లు పూడ్చకపోవడంతో వర్షాలు కురిసిన సమయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ లైన్ పూర్తి చేసి రోడ్లు పూడ్చాలని కోరుతున్నారు.

ఉపాధ్యాయులు డిజిటల్ బోధనకు అలవాటు పడాలి



స్కూల్ కాంప్లెక్స్‌లో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డైట్ ప్రిన్సిపాల్ సుధాకర్

తగరపువలస: మారుతున్న విద్యా విధానానికి అనుగుణంగా ప్రతి ఉపాధ్యాయుడు డిజిటల్ బోధనకు అలవాటు పడాలని భీమిలి డైట్ ప్రిన్సిపాల్ ఎల్. సుధాకర్ సూచించారు. చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో శనివారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్‌ను సందర్శించిన ఆయన ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులకు చదవడం, రాయడం, గణితంలో ప్రాథమిక నైపుణ్యాల అభివృద్ధిలో మరింతగా మెరుగులు దిద్దాలన్నారు. అనంతరం పరీక్షల సంస్కరణలు, బ్లూ ప్రింట్‌పై ఉపాధ్యాయులతో వ్యక్తిగతంగా చర్చించారు. విద్యార్థులలో ఆశించిన అభ్యసన ఫలితాలు తీసుకురావాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డి.ఆదినారాయణ, టి.శివజ్యోతి, ఉపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు, సీఆర్పీ టి.త్రినాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా



పందలపాక పంచాయతీ పైలపేట ఎస్సీ కాలనీ పంప్‌హౌస్ నుంచి వృథాగా పోతున్న తాగునీరు



రోడ్డు మీదుగా వృథాగా పోతున్న తాగునీరు

తగరపువలస: ఆనందపురం మండలం పందలపాక పంచాయతీ పైలపేట ఎస్సీ కాలనీ పంప్ హౌస్ నుంచి కొద్ది రోజులుగా తాగునీరు వృథాగా పోతోంది. పంప్‌హౌస్ వద్ద పైపు నుంచి వృథాగా పోతున్న తాగునీరు ఊరంతా రహదారులపై ప్రవహిస్తోంది. గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు, సిబ్బందికి సమాచారం అందించినా స్పందించలేదని కాలనీవాసులు తెలిపారు. రెండు వారాల క్రితం వరకు తాగునీటికి భీమిలి నియోజకవర్గంలోనే ఇబ్బందులు పడగా... ఇప్పుడు వర్షాలకు భూగర్భజలాలు చేరడంతో, వృథాగా పోతున్నా పట్టించుకోని పరిస్థితి. అధికారులు స్పందించి, తాగునీటి వృథాను అరికట్టాలని పైలపేట ప్రజలు కోరుతున్నారు.

బీచ్ కబడ్డీ పోటీల విజేత చంద్రంపాలెం



బీచ్ కబడ్డీ విజేతలకు ట్రోఫీ అందిస్తున్న వారియర్స్ జట్టు సభ్యులు

విజేతలకు బెంగాల్ వారియర్స్ ట్రోఫీల అందజేత

విశాఖ స్పోర్ట్స్: సాగరతీరంలో బీచ్ కబడ్డీ పోటీలు శనివారం ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీల్లో చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ బాల, బాలికల జట్లు విజేతలుగా నిలిచాయి. గోపాలపట్నం ఎస్వీఎల్ ఎస్‌జెడ్ హైస్కూల్ జట్లు రన్నరప్ సాధించాయి. విజేతలకు ప్రో కబడ్డీ లీగ్‌లో ఆడుతున్న బెంగాల్ వారియర్స్ జట్టు సభ్యులు ట్రోఫీలను అందజేశారు. ఆ జట్టు కెప్టెన్ దేవాంక్ దలాల్, చీఫ్ కోచ్ నవీన్ కుమార్ పాల్గొని.. ఆటను ఎలా మెరుగుపరుచుకోవచ్చో విద్యార్థులకు వివరించారు. పోర్టు స్టేడియంలో ఆదివారం జరిగే తమ మ్యాచ్‌ను వీక్షించేందుకు వారికి ఆహ్వానం పలికారు.

దీపాల వెలుగులో వినాయకుడి జనన వృత్తాంతం



దీపాల వెలుగులో గణపతి చరిత్ర తెలిపే రంగుల చిత్రాలు

తగరపువలస: గణపతి జనన వృత్తాంతం ఆద్యంతం ఆసక్తికరం. దానిని చిత్రరూపంలో వేసి, దీపాలతో అలంకరించడంతో ఆకట్టుకుంటోంది. జీవీఎంసీ రెండోవార్డు సంతపేట కుమ్మరివీధిలో శాలివాహన యువజన సేవా సంఘం గణపతి మండపం వద్ద ఈ దీపాలంకరణ చేపట్టింది. పార్వతీదేవి నలుగు పిండితో చేసిన వినాయకుని బొమ్మ నుంచి శివుడిని అడ్డగించడం, కోపంతో వినాయకుని తల ఖండించడం, గజాసురుని తల తీసుకువచ్చి బతికించడం వంటి ఘట్టాలను ఈ చిత్రమాలికలో పొందుపరిచారు.

నీ మూర్తికే మా మొదటి ప్రణామం

వినాయకా నీ మూర్తికే మా మొదటి ప్రణామం అంటూ ఆది పూజ్యుడు గణపతిని మనసారా అర్చించారు నియోజకవర్గ వాసులు. గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా విభిన్న రూపాల్లో కొలువైన విఘ్నాధిపతికి ప్రత్యేక పూజలు చేశారు. పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

– తగరపువలస/భీమునిపట్నం



మధురవాడ జీవీఎంసీ కార్యాలయ ఆవరణలో..




మధురవాడ రైతుబజారులో..



సంతపేట రెడ్డివీధిలో అశ్వారూఢుడై..



భీమిలిలో శిరస్సుపై శివలింగంతో..



అనిట్స్ రహదారిలో గాండీవధారియై..



కుమ్మర వీధిలోని మండపంలో కుమ్మరిసారెపై కుండ చేస్తున్న గణపతి



భీమిలి మండలం అన్నవరంలో శ్రీపతి అలంకరణలో..



భీమిలి మండలం కొత్తపేటలో సర్వేశ్వరునిగా..

స్మార్ట్ కార్డుల పంపిణీ



మద్దిలో స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు. మద్దిలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, పద్మనాభంలో తహసీల్దార్ కె.ఆనందరావు ఈ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో వీఆర్వో అప్పలరాజు పాల్గొన్నారు.